
# స్త్రీ జనోద్ధరణ



- సి. ఆనందారామం

విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఒక సారి తను ప్రత్యేకంగా తెచ్చుకున్న సీసాలో నీళ్ళు తాగి తన ఉపన్యాసం ఇలా ముగించాడు.

"...ఇలా మేము ఎన్నో విధాలుగా దళితుల కోసం, -ముఖ్యంగా స్త్రీల కోసం ఎన్నో కార్యక్రమాలు తలపెట్టాం. ప్రత్యేకమైన శాఖలు తెరిచాం. మేము ప్రారంభించిన "విమన్స్ స్టడీస్" అనే శాఖను యు.జి.సి. గుర్తించి ఫండ్స్ శాంక్షన్ చేసింది. ఆ శాఖలో మేము ఎన్నో విధాలైన స్త్రీల సమస్యల పైన పరిశోధనలు చేయించాలని సంకల్పించాం. ఈ రకంగా మా విశ్వ విద్యాలయంలోని ఔత్సాహికులందరూ స్త్రీ జనోద్ధరణకి కంకణం కట్టుకున్నాం..."

సభలో చప్పట్లు మారుమ్రోగాయి. అందరిలో ఆ ఉపన్యాసం విన్న అనసూయకి ఆనందంతో వొళ్ళు పొంగింది. ఆమె ఆ కాలేజిలో అయిదేళ్ళుగా లెక్చరర్‌గా పని చేస్తోంది - చదువుకొనే రోజుల్నించీ పురుషులు స్త్రీలను ఎన్ని విధాలుగా అణిచి ఉంచారో ప్రత్యక్షంగా చూసింది. తన తల్లి, అక్క, ఇప్పటికీ అనుభవిస్తోన్న బానిసత్వం తలుచుకొంటే కళ్ళ నీళ్ళు తిరుగుతాయి - తన జీవితం మాత్రం? చదువుకొని ఉద్యోగం చేస్తోందన్న పేరే గాని ఏమాత్రం స్వతంత్ర వ్యక్తిత్వం నిలుపు కోగలిగింది? ఏ కొంచెం స్వతంత్రంగా జీవించటానికి ప్రయత్నించినా, కుటుంబంలో గొడవలు తెగతెంపుల వరకూ సాగవలసిందే? తెగతెంపులు చేసుకొనే తెగింపు లేక సొంత ఆలోచనలకు స్వస్తి చెప్పి ఎక్కడికక్కడ రాజీ పడిపోవలసిందే! ఈ నాడు విశ్వవిద్యాలయ స్థాయిలో స్త్రీ సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందంటే సమాజం ఎంత ప్రగతిని సాధించిందో కదా!

అదే సభలో మిస్. శైలజని "విమన్స్ స్టడీస్" సెక్షన్‌కి హెడ్‌గా ప్రకటించారు. మిస్. శైలజ ఔత్సాహికురాలైన సంఘ సేవకురాలు - సమాజంలో ఎక్కడ ఏ స్త్రీకి అన్యాయం జరిగిందని తెలిసినా, వెంటనే అక్కడికి వెళ్ళి ఒక ఉద్యమాన్ని లేవదీసి, ఆ అన్యాయం పరిష్కరించి, వస్తుంది - రేడియోల్లోనూ, టి.వి.ల్లోనూ, ఎన్నో సార్లు స్త్రీలను మేల్కొల్పుతూ ప్రసంగాలు చేసింది. ఎక్కడెక్కడ మహిళోద్యమ సభలు జరిగినా ఆవిడ తప్పకుండా ఉంటుంది. అనసూయ శైలజకి షేక్ హేండ్ ఇచ్చి "కంగ్రాట్యులేషన్స్ శైలజా!" అంది మనసారా...

"విమన్స్ స్టడీస్" ప్రారంభమయిన నాటి నుంచీ మిస్ శైలజ ఆధ్వర్యంలో చురుగ్గా పని చేయసాగింది. ఎందరో విద్యార్థినులు ఆ ప్రోగ్రాం క్రింద స్త్రీల సమస్యలపై పరిశోధనలు చేయటానికి యం.ఫిల్. లోనూ, పి.హెచ్.డి. లోనూ కూడా తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇద్దరు స్టూడెంట్స్ అనసూయ గైడెన్స్‌లోనే పరిశోధన ప్రారంభించారు. స్త్రీ సమస్యలపై వీధి నాటకాన్ని రచించి తను కూడా అభినయించి అనేక చోట్ల తన గ్రూప్‌తో ప్రదర్శన లిచ్చి అభినందన లందుకొంది శైలజ.

నాటక ప్రదర్శన జరిగిన ప్రతి చోటా విధిగా శైలజ ఉపన్యసించేది. ఆ ఉపన్యాసం వినటానికి స్త్రీలు వందల సంఖ్యలో వచ్చేవారు - "ఎంత చైతన్యం, స్త్రీ జాతిలో" - అనుకుంది అనసూయ.

యూనివర్శిటీలో రీడర్ పోస్ట్ అనౌన్స్ చేసారు - అన్ని అర్హతలూ ఉన్న అనసూయ తనకి కాక మరెవరికి ఆ పోస్ట్ వస్తుందన్న ధీమాతో ఇంటర్వ్యూకి వెళ్ళింది. ఆమెకంటె అన్ని విధాలా తక్కువ స్థాయిలో ఉన్నవాడిని, కనీసం లెక్చరర్ కావటానికి కూడా అర్హతలు లేని వాడిని రెండు ఇంక్రిమెంట్లు కూడా ఇచ్చి రీడర్‌గా వేసుకున్నారు. ఇది అన్యాయమని అనసూయ యెగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కి రిపోర్ట్ చేసింది - అలా "ఉన్నమాట" అన్నందుకు, "దాచిన మోసాన్ని" నలుగురిలో బయట పెట్టినందుకూ అధ్యక్షుడికి అనసూయ మీద వల్లమాలిన కోపం వచ్చింది. అనసూయతో ఎవరు మాట్లాడినా వాళ్ళ మీద అధ్యక్షుడికి కోపం వస్తుందనే వార్త నిశ్శబ్దంగా యూనివర్శిటీ అంతా ప్రచారమయి పోయింది. అనసూయతో అంతకు ముందు ఎంతో స్నేహంగా ఉండే వ్యక్తులందరూ అనసూయని చూడగానే ఏదో వంకతో ముఖం తప్పించి తిరగటం మొదలు పెట్టారు. ఒక్క శైలజ మాత్రం అనసూయని ఎప్పటి లాగే స్నేహంగా పలకరించి ఆప్యాయంగా మాట్లాడేది. ఆమెకి జరిగిన అన్యాయం గురించి వివరాలు అడిగి తెలుసుకొనేది - శైలజ ఏ మాత్రం అరమరికలు లేకుండా ఆమెతో అన్ని విషయాలూ మాట్లాడేది. ఆ కారణం వల్ల అనసూయ కూడా తనకు జరిగిన అన్యాయానికి ప్రక్రియగా ఏం చెయ్యాలనుకొంటున్నదో, అవన్నీ వివరంగా చెప్పేది - ఆ సమయంలో తనెలాంటి ఊబిలో ఇరుక్కొంటున్నదో, అనసూయ ఊహించలేక పోయింది. అనసూయ దగ్గర యెగ్జిక్యూటివ్ కౌన్సిల్ తీర్మానాల కాపీలన్నీ ఉన్నాయి. యూనివర్శిటీ రూల్స్ ప్రకారం ఆ తీర్మానాలు ఉల్లంఘించి ప్రవర్తించ

నిద్ర బాగా పట్టాలంటే రాత్రి భోజనం కాస్త తేలికగా వుండాలి. కాస్తవేడి పాలు పడుకోబోయే ముందు తాగాలి. ఓ పది నిముషాల పాటు నడిచి తరువాత నిద్ర కొరిగినా మంచిది.

* * *

పాదాలని నిర్లక్ష్యం చేయకూడదు.. కూర్చుని - కాళ్ళు తిన్నగా వుంచి పాదాలు మాత్రం - యిటో పదిసార్లు అటో పదిసార్లు తిప్పండి.

కూడదు - కానీ వైస్ ఛాన్సెలర్ ప్రత్యేకమైన పాక్షిక దృష్టితో ఆ తీర్మానాలన్నీ మార్చి ప్రకటన ఇచ్చి, తనకు కావలసిన వ్యక్తిని రీడర్‌గా తెచ్చుకున్నాడు. అనసూయ తన దగ్గిరున్న సాక్ష్యాధారాలతో, యూనివర్శిటీ మీద దావా వేసింది. వైస్ ఛాన్సెలర్ సాధ్యమయినంత వరకూ కాగితాలు మార్చేసాడు - అసలు కాగితాలు యూనివర్శిటీలో మరే డిపార్ట్‌మెంట్‌లోనూ, ఏ ప్రొఫెసర్ దగ్గిరా దొరక్కుండా జాగ్రత్త పడ్డాడు. తన దగ్గిర ఆ కాగితాల కాపీలున్నట్లు వైస్ ఛాన్సెలర్‌కి ముందుగానే తెలిసిందనీ, అందుకే ముందుగానే తగిన ప్రతి సన్నాహాలు చేసుకో గలిగాడనీ, చెప్పాడు అనసూయ లాయర్. అనసూయ ఆ విషయం శైలజతో చెప్పుకొంది బాధగా - శైలజ ముఖం అదోలా మారిపోయింది. "నీ మంచి కోరి ఒక సలహా చెప్తాను. ఏమీ అనుకోవుగా!" అంది

"ఛ! నీ మాటలకు ఏమైనా అనుకోవటం ఏమిటి? ఏమీ అనుకోను. చెప్పు. ఈ పరిస్థితుల్లో ఏం చెయ్యాలో పాలుపోక నా బుర్ర వేడెక్కిపోతోంది."

"వి.సి.తో తగవులాట ఎందుకు? రాజీ పడిపోరాదూ? మళ్ళీ రెండేళ్ళలో రీడర్ పోస్ట్ వస్తుందిగా! అది నీకు రావచ్చు. ఇప్పుడు తగాదా పడటం వల్ల అది కూడా పోతుంది. ఇది కూడా రాదు - కోర్టుల్లో కేసులు ఒకంతట తెములుతాయా? వాళ్ళు "మంది సొమ్ము" గనుక ఎంతైనా ఖర్చు పెట్టగలరు. కష్టార్జితం - మనం ఎంతని ఖర్చు పెట్టగలం?"

అనసూయ నిర్ఘాంత పోయింది. స్వతంత్ర వ్యక్తిత్వం కోసం అవసరమయితే భర్తతో పోట్లాడ వలసిందే నని ప్రతి సభలోనూ ఉపన్యాస మిచ్చే శైలజ మాటలేనా ఇవి? భర్తతో పోట్లాడటమంత క్లిష్ట సమస్య కాదు, యాజమాన్యంతో పోట్లాడటం - మొదటిది జీవితానికి సంబంధించిన సమస్య - రెండవది ఉద్యోగానికి మాత్రమే సంబంధించిన సమస్య - అనసూయ మాట్లాడక పోవటం చూసి "నీ ఇష్టం." అని సంభాషణ తుంచేసింది శైలజ - తర్వాత తన దగ్గిరున్న సమాచారం వి.సి.కి. తెలియజేసింది శైలజే నని తెలుసుకుని, మరొక సారి మరింత నిర్ఘాంత పోయింది - శైలజ ... స్త్రీ స్వాతంత్ర్యం ... మార్క్సిజం ... అంటూ లెక్చర్లిచ్చే శైలజ - ఇలా యాజమాన్యానికి తొత్తుగా మారి, అంతరాత్మనే స్వార్థానికి అమ్మేసుకుని, ఇంత నమ్మక ద్రోహం చేస్తుందా?

ఈ విషయం తలుచుకుని చాలా రోజులు బాధ పడింది అనసూయ - తనకు రీడర్ ఉద్యోగం రానప్పటి కంటె ఎక్కువ బాధ పడింది. కానీ, ఇంతకంటె మరో పెద్ద దెబ్బ ఆమెకి అనుకోని దిశ నుంచి ఎదురైంది. అనసూయ భర్త శంకర్రావు - అతడు యమ్.యస్.సి. పాసయి, ప్రస్తుతం మరో యూనివర్శిటీలో పి.హెచ్.డి. చేస్తున్నాడు. ఉద్యోగం దొరకలేదు - అందుకతడు గట్టిగా ప్రయత్నించనూ లేదు - ఎప్పుడూ లేబ్‌లో ఉంటాడు - లేదా, పుస్తకాలు ముందేసుకుని కూచుంటాడు - ఇల్లు అనసూయ సంపాదనతోనే గడిచేది. శంకర్రావు అహం ఏమాత్రం గాయ పడకుండా, ఇంటి పనీ, కాలేజి పనీ, అంతా తనే చూసుకుంటూ అతడి పరిశోధనని ప్రోత్సహించేది - అంతే కాదు. అతడి పర్సనల్ సెక్రటరీ లాగ అతడి పుస్తకాలన్నీ సర్ది ఉంచేది - అతడి రీసెర్చ్ కార్డ్స్, కలెక్ట్ చేసిన మెటీరియల్, రాసిన పేపర్స్, అన్నీ ఒక క్రమంలో సర్ది ఉంచేది. సాధారణంగా భార్య భర్తల మధ్య ఉండే చిట్టి పొట్టి కలహాలెన్ని ఉన్నా వాళ్ళిద్దరి మధ్యా పెద్ద అభిప్రాయ భేదాలెప్పుడూ ఉండేవి కావు-

ఆ రోజు శంకర్రావు మంచి మూడ్‌లో ఉన్నాడు - భోజనం చేస్తున్నంత సేపూ జోక్స్ చేస్తోనే ఉన్నాడు - భోజనాలయ్యాక అనసూయ చీర చూసి "పాపం! ఎలాంటి మామూలు వాయిల్ చీరలు కట్టుకుంటున్నావు? నీ ఒక్కదాని జీతం తోనే ఇల్లు గడవాలి మరి!" అన్నాడు.

"అవేం మాటలు? ఏ చీర అయితేనేం? శుభ్రంగా ఉందా? లేదా? మీ రీసెర్చ్ అయిపోగానే మీరూ సంపాదిద్దురుకాని లెండి-"

"మన ఖర్చులకి తోడు లాయర్ ఖర్చు ఒకటి - చాలా అవుతోందేమో కదూ! ఎందుకొచ్చిన ఖర్చులు? ఈ కేసు ఉపసంహరించు. కోరాదూ!"

గతుక్కుమంది అనసూయ.

"ఇది నా ఆత్మాభిమానానికి సంబంధించిన విషయం.డబ్బు గురించి మాట్లాడతారేమిటి? డబ్బు రావచ్చు. పోవచ్చు - కానీ, రీడర్ కాగలిగే అర్హత నాకు లేదనే అపఖ్యాతి ఎలా సహించగలను?"

"ఆ! ఏం అపఖ్యాతి? అర్హతలూ, జరిగిన అన్యాయమూ అందరికీ తెలియదా?"

"నా క్షోభ మీకు అర్థం కాదు - కనీసం ప్రతిఘటించకుండా పిరికి దానిలాగ నోరు మూసుకు కూచోనా? నా వల్ల కాదు." అనసూయ అంత ఖండితంగా చెప్పేసరికి శంకర్రావుకి కోపం వచ్చింది - ఇన్నాళ్ళ ఆమె త్యాగం, ఆమె పడిన శ్రమ క్షణంలో మరిచిపోయాడు - ఆమె తన మాట వినలేదనే పురుషాహంకారం మాత్రమే మిగిలింది - ఆ రోజు మొదటి సారిగా వాళ్ళిద్దరి మధ్యా నిజమైన అభిప్రాయ భేదాలొచ్చాయి. ఎడముఖం పెడ ముఖంగా గడిపారు. ఒకటి రెండు రోజుల్లో సర్దుకు పోతుందనుకున్న గొడవ చినికి చినికి గాలివాన అయింది. రోజూ శంకర్రావు ఇదే ప్రస్తావన తెచ్చేవాడు - అనసూయ అతడితో వాదించలేక అలిసిపోయేది - ఇద్దరి మధ్యా దూరం పెరిగింది - మాటా మాటా పెరిగింది - అనసూయ ప్రతి మాటకూ పెడర్థాలు తీస్తూ వ్యాఖ్యానిస్తూ ఆమెని మానసికంగా హింసించి హింసించి, చివరికి ఒక రోజు "నీ సంపాదనతో నన్ను పోషిస్తున్నానని నీకు అహంకారం - భర్త ననే లక్ష్యం లేదు - మనం విడిపోవటం మంచిది" అనేసాడు. మనసు మొద్దుబారినట్లయిపోయి కొన్ని క్షణాలు ఏమీ మాట్లాడలేకపోయింది - వంట్లో జవసత్త్వాలు ఎవరోలాగేసినట్లయింది - కిందనే కూలబడింది. ఆ సమయంలో శంకర్రావు ముఖం మీద నవ్వు కనిపించింది. తన దైన్యాన్ని చూసి ఆనందంగా నవ్వుకొంటూన్న ఆ పైశాచికత్వాన్ని భరించలేక పోయింది - ఆడ దాని బలహీనతతో మమతానురాగాలనే బలహీనతతో - చాలా క్రూరంగా ఆడుకొంటున్నాడు మొగవాడు - తన ఎదుట ఉన్నది ఒక మొగవాడు సగటు మొగవాడు - ఏ రకమైన మమతలూ లేక కేవలం పురుషాహంకారంతో స్త్రీని పెళ్ళి పేరిట "ఉపయోగించు కోవాలని" చూసే మొగవాడు - శంకర్రావు ముఖంలో నవ్వు ఆమెని కాళికగా మార్చింది. "మీ ఇష్టం - నా నిర్ణయం మార్చుకొనేది లేదు" - అనేసింది ఖండితంగా..

ఆ మరునాడే శంకర్రావు తన వస్తువులన్నీ సర్దుకొంటుంటే, ఆమె మనసులో లోలోపల ఏదో సన్నని గొంతు" ఇది సంభవమేనా? ఇదంతా నిజంగా జరుగుతోందా?" అని నిశ్శబ్దంగా విశ్వమంతా వ్యాపిస్తూ రోదించింది - అతడు వెళ్ళిపోతోంటే మహా ప్రవాహంలో కొట్టుకు పోతున్న దానిలా చూస్తూ ఉండిపోయింది-

కట్టుకున్న భర్తే ఈ విషయంలో ఎందుకింత పట్టుదల పట్టాడో, అతి త్వరలో అర్థమయింది అనసూయకి - అది, శంకర్రావుకి ఆమె పని చేస్తున్న యూనివర్శిటీలోనే లెక్చరర్ ఉద్యోగం దొరికినప్పుడు-

"డబ్బు" అనేది ఎంత అద్భుతమైనది? ఎంత ఛండాలమైనది? శైలజ మాత్రమే కాదు - తన భర్త - కాదు! కాదు! మాజీ భర్త!...

ఎప్పుడు వ్యాపించిందో, ఎలా వ్యాపించిందో కాని అనసూయ లాయర్‌కీ అనసూయకీ అక్రమ సంబంధం ఉండటం వల్లే శంకర్రావు ఆమెకి విడాకులిచ్చాడనే వార్త వ్యాపించింది. మొగవాళ్ళంతా ఆమె వంక అదోలా చూడటం ప్రారంభించారు - అడది డైవోర్సీ అంటేనే లోకువ - దానికి తోడు అపనిందలతో ఒంటరిగా ఉంటే, మరింత లోకువ. ప్రతి మొగవాడికీ, తను కొంచెం సాహసిస్తే ఆమె తన వళ్ళో వచ్చి వాలిపోతుందని ఆశ - ఆ ధోరణి వాళ్ళ మాటల్లో - వాళ్ళ చూపుల్లో స్పష్టంగా కనిపించి యూనివర్శిటీలో మసలడమే దుర్భరం కాసాగింది అనసూయకి-

అనసూయ కేసు హియిరింగ్‌కి వచ్చింది - లాయర్ ఆమెని కోర్టులో సబ్‌మిట్ చేయటానికి యెవిడెన్స్ పేపర్స్ తెమ్మని చెప్పాడు - ఎంత వెతికినా ఇంట్లో ఆ పేపర్స్ కనిపించలేదు - చాలా ఆలస్యంగా స్ఫురించింది అనసూయకి, శంకర్రావే ఆ పత్రాలు మాయం చేసాడని. నమ్మిన వాళ్ళంతా ఇలా మోసం చేస్తోంటే, ఏం చెయ్యగలదు?

అనసూయ కేసు ఓడిపోయింది.

శంకర్రావు పి.హెచ్.డి. పూర్తి చేసాడు-

అదే యూనివర్శిటీలో రీడర్ కూడా అయ్యాడు - యం.ఏ. పాసయిన కన్నె పిల్లని "ప్రేమించి" (?) పెళ్ళి చేసుకుని, తన "పలుకుబడి" ఉపయోగించి లెక్చరర్ ఉద్యోగం కూడా ఇప్పించాడు-

అనసూయ అపనిందలతో ఒంటరిగా లెక్చరర్‌గానే కాలం గడుపుతోంది-

ఇప్పటికీ...

వైస్ ఛాన్సెలర్ తను కావిస్తోన్న స్త్రీ జనాభ్యుదయ కార్యక్రమాల గురించి ఉపన్యాసాలు ఇస్తోనే ఉన్నాడు.

శైలజ వీధి నాటకాలు ఏర్పాటు చేస్తూ స్త్రీలను ప్రసంగాలు చేస్తోనే ఉంది.

అంతే కాదు.

శంకర్రావు పెళ్ళి చేసుకున్న భ్రమర కూడా స్త్రీ జాతిని ఉత్తేజ పరుస్తూ ఉపన్యాసాలిస్తోంది. ఆమె ఉపన్యాసాలకు జనం తండోప తండాలుగా వెళ్తుంటారు.

ఎంత తియ్యగా - మత్తుగా - అద్భుతంగా ఉంటాయి. మాటలు ఉత్తి బోలు మాటలు!

ఒంటరితనం భరించలేని అనసూయ ఉపన్యాసాలకీ, ప్రసంగాలకీ దూరంగా - అనాథ స్త్రీల కోసం - అంటే వితంతువులూ, భర్తృపరిత్యక్తలూ మొదలైన వారి కోసం ఒక పాఠశాల నడుపుతోంది.□

ముట్టపు చూపుకై వచ్చి ఏ చుట్టమో నల్లుల్ని వదిలి వెడితే తిట్టుకోకండి - స్పటిక పొడి వేడి నీళ్లలో కలియపెట్టి మంచాం మీద ముఖ్యంగా సందుల దగ్గర పోయండి.

* * *

పచ్చిమిరప కాయలు తొడిమెలు తీసి నిల్వ చేస్తే ఎక్కువ రోజులుంటాయి.